# సింగిల్ పేజీ కథలు

## అదృష్టం

**"ఈరోజుల్లో ఎవర్ని నమ్మగలం. అదుగో మోహనరావు మాష్టారు... ఇంజనీరు, ఇరవై వేల రూపాయలు సంపాదిస్తున్నాడు అని చెప్పి రెండు లక్షలు కట్నం ఇచ్చి కూతురి పెళ్ళి చేసాడు. ఏమయింది? తిరుగు టపాలో ఇంట్లో వచ్చిపడింది. అందు కేనండి శాస్త్రిగారు, నాకంతంత దూరం సంబంధాలు ఇష్టంలేదు" అన్నాడు శంకర్రావు మాష్టారు.**

''మీరు మరీనండి. ఎవరో ఎక్కడో ఏదో చేసాడనీ అందరూ అలా ఉంటారా. ఈరోజుల్లో అమెరికా నుండి ఆఘమేఘాల మీద వచ్చి పెళ్ళిళ్ళు చేసుకుని వెళ్ళిపోతున్నారు. వాళ్ళంతా హాయిగా లేరు. అంతెందుకు మొన్నటికి మొన్న మన కుటుంబరావుగారి అమ్మాయికి అమెరికా సంబంధం నేనే తెచ్చాను. ఈరోజు ఆ ఇంట్లో అన్నీ అమెరికన్ మేడ్. ఎంత మంచి అల్లుడో చూడండి'' అన్నాడు పెళ్ళిళ్ళ పేరయ్య శాస్త్రి.

''మీరెన్నయినా చెప్పండి శాస్త్రిగారు, నా కూతురిని అంత దూరం ఇవ్వలేను. ఆ కుర్రాడు ఎలాంటివాడో, తాగుతాడో, తిరుగుతాడో తెలియదు. ఇలా తెలిసి తెలియని సంబంధం చేసి, దాని గొంతు కోయలేనండి''

''శంకర్రావుగారు, మరోసారి ఆలోచించుకోండి. ఆ అబ్బాయి మీ అమ్మాయిని ఎక్కడో చూసాడు. బాగా నచ్చింది. వాళ్ళకి కట్నకానుకల పట్టింపు లేదు. అబ్బాయి డాలర్లలో సంపాదిస్తున్నాడండీ. మీకు కావాలంటే కన్యాశుల్కం ఇవ్వగలడు''

''నేను అదే అంటున్నాను. ఇంత సంపాదిస్తున్నవాడు, మంచివాడు అయితే లక్షలమంది అమ్మాయిలున్నారండి. మా అమ్మాయినే ఎందుకు పెళ్ళి చేసుకుంటానంటున్నాడు.''

అంతవరకు ప్రశాంతంగా ఈ వాద ప్రతివాదనలు విన్న ఈశ్వరరావు

''ఏమండీ శాస్త్రిగారు.. అతనికి ఇష్టం లేదంటున్నాడు కదా. పోనీ అతనిష్టప్రకారమే ఈ దగ్గర్లో ఏదో సంబంధం చూడవయ్యా'' అన్నాడు.

''సరే, మీ ఇష్టం. మంచి సంబంధం, కానీ కట్నం లేదు. మీరు సంతోషిస్తారని తీసుకు వచ్చానండి. మీరు అడిగినట్లే దగ్గర సంబంధమే తీసుకు వస్తాను. వెళ్ళొస్తాను'' అని చెప్పి శలవు తీసుకున్నారు శాస్త్రిగారు.

''శంకర్రావు మరోసారి ఆలోచించు. దూరం, దగ్గర అని మొండిపట్టు పట్టి కూర్చుంటే లాభం



లేదు. కుర్రాడు మంచివాడయి ఉండాలి'' అన్నాడు ఈశ్వరరావు.

''నువ్వన్నది కరెక్టేనయ్యా. పెళ్ళిళ్ళ పేరయ్య ఎప్పుడయినా ఫలానా కుర్రాడు మంచివాడు కాదు అని చెబుతాడయ్యా, ఆ మంచి చెడ్డలు మనం చూసుకోవాలి. పెళ్లి కుమారులు అమెరికా నుండి ఆఘమేఘాల మీద వచ్చి పెళ్ళి చేసుకుని పారిపోతారు. అక్కడ కూతురి బ్రతుకు ఎలా ఉందో మనకు తెలియదు''.

★ ★ ★

పట్టువదలని విక్రమార్కుడిలా శాస్త్రిగారు వారం రోజులు తిరక్కుండానే మరో సంబంధం తీసుకువచ్చారు.

''మాష్టారు, ఈ అబ్బాయి విశాఖపట్నంలో పనిచేస్తున్నాడు. పుట్టి పెరిగింది బొబ్బిలి దగ్గర బొండపల్లిలో. మీకు నచ్చితే మిగతా విషయాలు మాట్లాడుకుందాం'' అని చెప్పి అబ్బాయి వివరాలు ఇచ్చాడు.

''శాస్త్రిగారు, ఆ ఊర్లో కొంత కాలం నేను హెడ్‌మాష్టారుగా పని చేసానయ్యా. అక్కడ చాలామంది నాకు తెలుసు. బహుశా ఈ కుర్రాడికి కూడా నేనే చదువు చెప్పి ఉంటాను'' అంటూ శాస్త్రిగారిచ్చిన వివరాలు నోట్ చేసుకున్నాడు.

శంకరం మాష్టారుగారు, ఆ ఊర్లో తనకి తెలిసిన వారందరి ద్వారా, అబ్బాయి గురించి ఎంక్వయిరీ చేయించాడు. అంతేకాకుండా విశాఖపట్నంలో కూడా వాకబు చేసాడు. చివరకు తేలిందేమిటంటే ఆ అబ్బాయి ఒకప్పుడు తనతో కలిసి పనిచేసిన రాములు మాష్టారుగారి అబ్బాయి.

అంతే! కళ్యాణం వచ్చినా, కక్కు వచ్చినా ఆగదన్నట్టు, ఆ తరువాత పెళ్ళి చూపులు, పెళ్ళి- ఘనంగా జరిగిపోయాయి.

తన ఏకైక కుమార్తె పద్మజ పెళ్ళిని రంగ రంగ వైభవంగా చేసాడు.

అమెరికా సంబంధం కాదని, తనతోటి మాష్టారు కొడుకుకే ఇచ్చి, ఘనంగా పెళ్ళి చేసిన శంకరం మాష్టారిని అందరూ అభినందించారు.

ఇది జరిగిన ఆరు నెలలకి మాష్టారికి కూతురి దగ్గర నుండి అర్జంటుగా రమ్మని ఫోన్ వచ్చింది. శంకరం మాష్టారు హుటాహుటిన వెళ్ళారు.

చినిగిన బట్టలతోను, వళ్ళంతా గాయాలతో, పద్మజ తండ్రిని కావలించుకుని భోరున విలపించింది. జరగకూడనిదేదో జరిగిందని అర్థమయ్యింది. కూతురిని అనునయిస్తూ ''ఏం జరిగిందమ్మా'' అన్నారు.

''మనం మోసపోయాము డాడీ. అతడు అనుక్షణం నన్ను అనుమానంతో వేధిస్తున్నాడు. తెలిసినవాడే కదా అని, తిరుగుబోతుని బాగా డబ్బులిచ్చి అంటగట్టేసారు అంటాడు. నువ్వెవరెవరితో తిరిగావో చెప్పు అని కొడుతున్నాడు. నేనింక ఇక్కడ ఉండలేను డాడీ. మీతోనే వచ్చేస్తాను'' అంది ఏడుస్తూ.

శంకరం మాష్టారికి అప్పుడర్థమయ్యింది.

మనకి తెలిసిన వాళ్ళంతా మంచివాళ్ళనీ, తెలియనివాళ్ళంతా చెడ్డవారని అనుకోలేము.

అందుకే! మంచి జీవిత భాగస్వామి దొరకటం గొప్ప అదృష్టం అంటారు.

**-మరడ వెంకట దాశరధి రావు (సూరత్)**